సాక్షి

పశ్చిమగోదావరి

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



కోళ్ల ఫారాల్లో బయో సెక్యూరిటీ

కోళ్ల ఫారాల్లో శానిటేషన్, బయో సెక్యూరిటీ విధానాలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ చెప్పారు. 8లో ▸



పీహెచ్‌సీలో చోరీ యత్నం

పెంటపాడు పీహెచ్‌సీలో సోమవారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. పీహెచ్‌సీలో ఫర్నిచర్ ధ్వంసం చేసి ఇంజెక్షన్ పెట్టెలు, మందులు కాల్చివేశారు. 8లో ▸



శ్రీవారికి ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో శ్రీవారికి ఏకాదశి ఉత్సవాన్ని మంగళవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ వేడుక జరిగింది.

సేవలు పక్కా

గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేస్తూ సచివాలయ వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటికి సొంత భవనాలను సమకూరుస్తోంది. జిల్లాలోని 296 పంచాయతీల పరిధిలో రూ.141.2 కోట్ల వ్యయంతో 353 చోట్ల పక్కా భవనాల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే 270 భవనాల పనులు పూర్తయ్యాయి. సచివాలయ భవనాల ప్రారంభోత్సవాలను పల్లెల్లో, పట్టణాల్లో అధికారులు ప్రజలతో మమేకమై పండగలా జరుపుకుంటూ సేవలను ప్రారంభిస్తోంది. కాగా, మిగిలిన సచివాలయ భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- జిల్లాలో గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు
- 296 పంచాయతీల్లో 353 చోట్ల పక్కా కట్టడాలు
- రూ.141.2 కోట్ల వ్యయంతో శరవేగంగా నిర్మాణం
- సిబ్బంది, ప్రజలకు సౌకర్యవంతంగా భవనాల డిజైన్
- ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షల వరకు ఖర్చు
- ఇప్పటికే 270 భవనాలు పంచాయతీలకు స్వాధీనం

సాక్షి, భీమవరం: స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు 2019 అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి రోజున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. గ్రామాల్లో రెండు వేలు, పట్టణాల్లో నాలుగు వేల జనాభా ప్రాతిపదికన జిల్లాలో 535 సచివాలయాలను ఏర్పాటు చేశారు. గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్, ఉద్యాన అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర పోస్టులను నియమించడం ద్వారా జిల్లాలో ఐదు వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. 35 ప్రభుత్వ శాఖలకు చెందిన 500లకు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చారు.

ప్రత్యేక డిజైన్‌తో భవనాలు

గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ, బిల్ కలెక్టర్, అటెండర్ పేరిట ముగ్గురు, నలుగురు ఉద్యోగులు మాత్రమే ఉండేవారు. అన్ని శాఖల సిబ్బంది అందుబాటులో లేక చాలా వరకు పనుల నిమిత్తం ప్రజలు వ్యయప్రయాసలకోర్చి మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 11 ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులను సచివాలయాల్లో నియమించడం వల్ల అన్ని సేవలు సచివాలయాల్లో అందేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారు. ప్రజలు, ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కార్పొరేట్ కార్యాలయాల తరహాలో సచివాలయ భవనాలకు ప్రత్యేక డిజైన్ రూపొందించారు. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఉద్యోగుల కోసం కింద రెండు గదులు, ఒక హాల్, శానిటేషన్ సామగ్రి కోసం స్టోర్ రూమ్, మొదటి అంతస్తులో రెండు గదులు, సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా విశాలమైన హాల్‌తో డూప్లెక్స్ భవనాలు నిర్మిస్తోంది.

జిల్లాలో 353 చోట్ల..

జిల్లాలోని 253 పంచాయతీల పరిధిలో 353 సచివాలయ భవనాల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో నరసాపురం రెవెన్యూ డివిజన్‌లోని 114 పంచాయతీల్లో 136 భవనాలు, తాడేపల్లిగూడెం డివిజన్‌లోని 82 పంచాయతీల్లో 97, భీమవరం డివిజన్‌లోని 100 పంచాయతీల్లో 120 భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. వీటిలో నరసాపురం పరిధిలో 106, తాడేపల్లిగూడెంలో 77, భీమవరంలో 87 పూర్తి చేసి ఇప్పటికే పంచాయతీలకు అప్పగించగా ఆయా భవనాల్లో సచివాలయ సేవలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగిలిన వాటి నిర్మాణాలు కూడా త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు.





విస్సాకోడేరు గ్రామ సచివాలయం

నియోజకవర్గం	పంచాయతీలు	సచివాలయ భవనాలు	మొత్తం విలువ (రూ. కోట్లలో)	పూర్తయినవి
భీమవరం	34	38	15.2	32
ఆచంట	33	42	16.8	26
పాలకొల్లు	49	54	21.6	41
నరసాపురం	32	40	16	39
తాడేపల్లిగూడెం	42	47	18.8	38
తణుకు	40	50	20	39
ఉండి	50	62	24.8	40
గణపవరం (మం)	16	20	8	15



విస్సాకోడేరు సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు



వీరవాసరం మండలంలోని రాయకుదురు గ్రామ సచివాలయం



తణుకు మండలంలోని ముద్దాపురం గ్రామ సచివాలయం



తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం గ్రామ సచివాలయం



బొండాడపేట సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఉద్యోగులు

నిర్మాణాలు అద్భుతం



సచివాలయ భవనాలను అద్భుతంగా నిర్మించారు. గతంలో పంచాయతీ భవనాలు నిర్మించాలంటే ఎన్నో ఏళ్లు పట్టేది. కానీ సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తెచ్చి ప్రత్యేక నిధులు కేటాయించడం ద్వారా భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.

– గాది వెంకటేశ్వరరావు, పల్లిపాలెం, కాళ్ల మండలం

చిరస్థాయిగా...



ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సీఎం జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రజలకు ఏ చిన్న అవసరం వచ్చినా, ఏ చిన్న సమస్య వచ్చినా సచివాలయానికి వస్తే అన్నింటికి ఇక్కడ పరిష్కారం దొరుకుతుంది.

– గెద్దం భారతి, రాయకుదురు గ్రామ సర్పంచ్

ప్రత్యేక డిజైన్‌తో కట్టారు



గ్రామంలో ప్రత్యేక డిజైన్‌తో సచివాలయ భవనం నిర్మించారు. ప్రజలు, ఉద్యోగులకు సౌకర్యవంతంగా అన్ని సదుపాయాలు కల్పించారు. గ్రామంలో ఆర్బీకే, రోడ్లు, డ్రెయిన్లు నిర్మించుకున్నాం. సచివాలయ నిర్మాణంతో సమస్యలన్నింటికి పరిష్కారం లభించింది.

– తాడి లక్ష్మణరావు, సర్పంచ్, చిట్టవరం, నర్సాపురం మండలం

సౌకర్యవంతంగా ఉంది



సచివాలయ భవనాన్ని చాలా ఆధునాతనంగా నిర్మించుకున్నాం. కార్పొరేట్ కార్యాలయాలకు దీటుగా సచివాలయ భవనం ఉంది. అన్ని హంగులతో సచివాలయాలకు భవనాలు నిర్మించడం వలన ప్రజలకు, ఉద్యోగులకు సౌకర్యంగా ఉంది.

– బొల్లా శ్రీనివాస్, విస్సాకోడేరు సర్పంచ్, పాలకోడేరు మండలం

శ్రమ తగ్గింది



గ్రామ సచివాలయం వలన అన్ని సేవలు ఒకే చోట అందుబాటులో ఉన్నాయి. గతంలో పింఛన్లు, సర్టిఫికెట్ల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ శ్రమ లేకుండా అన్నీ సచివాలయ వ్యవస్థ ద్వారా గడప వద్దకే అందిస్తున్నారు.

– తుమ్మగంటి నాగసత్యనారాయణ, ముద్దాపురం, తణుకు మండలం

న్యూస్‌రీల్

మంత్రి బుగ్గనను కలిసిన కలెక్టర్, ఎస్పీ



మంత్రి బుగ్గనతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

నరసాపురం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం నరసాపురంలో పర్యటించారు. మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలో మున్సిపల్ అతిథిగృహంలో మంత్రి బస చేయగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మున్సిపల్ అతిథి గృహానికి చేరుకున్నారు. బుగ్గనను గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధి, శాంతి భద్రతలపై కొద్దిసేపు చర్చించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ఉన్నారు.

వైఎస్సార్ సీపీని ఓడించడం అంత సులువు కాదు

మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య

పాలకొల్లు సెంట్రల్: రానున్న ఎన్నికల్లో బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీలు కలిసి ప్రయాణం చేసినా అధికార పక్ష వైఎస్సార్ సీపీని ఢీకొట్టడం చాలా కష్టమైన పనేనని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక లేఖ విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలకు మించి సంక్షేమాన్ని ప్రకటించలేకపోవడంతో ఓటర్లను ఆకర్షించలేకపోతున్నారన్నారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం అనుసరించకపోతే రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రతికూల అంశంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. జనసేనకు 175 అసెంబ్లీ స్థానాల్లో మూడో వంతు 60 అసెంబ్లీ, 6 పార్లమెంటు నియోజకవర్గాలను కేటాయించాలని తన లేఖలో జోగయ్య పేర్కొన్నారు. జనసైనికుల గౌరవానికి ఎటువంటి లోటూ లేకుండా అధికారం కూడా పంపకం జరగాలని స్పష్టం చేశారు.

విద్యార్థిగా మారిన కలెక్టర్

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆసక్తికర సంఘటన



తనకు తెలుగు నేర్పిన మాస్టారి మాటలు శ్రద్ధగా వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నరసాపురం: కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఓ వ్యక్తి ఎదుట చేతులు కట్టుకుని నిల్చుని ఆయన చెప్పేది శ్రద్ధగా వినడం పలువుర్ని ఆశ్చర్యానికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే.. సుమిత్‌కుమార్‌గాంధీ ఐఏఎస్‌గా ఎంపికై ట్రైనింగ్ పూర్తి చేసుకున్న తరువాత మొదటి పోస్టింగ్ 2014లో నరసాపురం సబ్‌కలెక్టర్‌గా రాగా, విధుల్లో చేరారు. ఒకప్పుడు సుమిత్‌కుమార్ పనిచేసిన నరసాపురం రెవెన్యూ డివిజన్ ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లాగా ఏర్పడింది. ఇదే జిల్లాకు సుమిత్‌కుమార్ కలెక్టర్‌గా వచ్చారు. మంగళవారం నరసాపురం కోడలు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కూడా నరసాపురం వచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం ఆమెను కలవడానికి నరసాపురం వచ్చిన కలెక్టర్ ముందుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తాను మొదటి సారి ఉద్యోగం చేసిన నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పాత ఉద్యోగులను ఆప్యాయంగా పలుకరించారు. అయితే హర్యానాకు చెందిన సుమిత్‌కుమార్‌గాంధీ ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో తెలుగు అంతలా బాగా మాట్లాడేవారు కాదు. దీంతో రిటైర్డ్ తెలుగు టీచర్ ఎ.సీతారామాంజనేయమూర్తి (రాంబాబు) వద్ద తెలుగు నేర్చుకున్నారు. ఇప్పుడు రాంబాబు మాస్టారు కూడా కలెక్టర్‌ను కలవడానికి రావడంతో పాత తన తెలుగు మాస్టారు వద్ద జిల్లా కలెక్టర్ ఇలా కాసేపు విద్యార్థిగా మారి వినయంగా పలకరించడం అందరినీ ఆకర్షించింది.

పులి కదలికలపై నిఘా

పోలవరం రూరల్: మెట్ట ప్రాంతంలో పులి కదలికలపై అటవీశాఖాధికారులు నిఘా పెట్టారు. పులి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరిస్తుండటంపై పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సోమవారం పోలవరం మండలం గుంజవరం గ్రామ సమీపంలోని గరిడికొండ ప్రాంతంలో పులి సంచరించగా, మంగళవారం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం హుకుంపేట, భీమోలు పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లు గుర్తించారు. రెడ్డి నాగంపాలెం, రేపల్లెవాడ సమీపంలోని మొక్కజొన్న తోటల్లో పులి పాదాల గుర్తులు కనిపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

వాసవీ మాతకు బంగారు కిరీటం

- పెనుగొండలో అమ్మవారికి సమర్పించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌తో కలిసి ప్రత్యేక పూజలు



పెనుగొండ వాసవీ మాత పంచమ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



వాసవీ శాంతి ధాంలో బంగారు కిరీట ధారణతో వాసవీ మాత




బంగారు కిరీటంతో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

పెనుగొండ: వాసవీ భక్తుల జై వాసవీ.. జైజై వాసవీ మాత నామస్మరణతో పెనుగొండ క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ ధాంలో 102 అడుగుల రుషీ గోత్ర మందిరంలోని 90 అడుగుల ఆర్యవైశ్యుల ఇలవేల్పు, తొలిత్యాగశీలి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి పంచలోహ విగ్రహ పంచమ వార్షికోత్సవాల సందర్భంగా మరకత శిల వాసవీ మాతకు తయారు చేయించిన కిలోన్నర బంగారు కిరీటాన్ని మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ధారణ పూజలు చేయించి అమ్మవారికి అలంకరించారు. మహోత్సవాలను పురస్కరించుకుని దేశంలోని 75 వాసవీ మాత దేవాలయాల నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన వాసవీ మాత ఉత్సవ విగ్రహాలను ఆయా ప్రాంతాల్లో దర్శనం ఇచ్చేలా అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. కిరీట ధారణ అనంతరం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ విశిష్టతను, ఆవశ్యకతను ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు వివరించారు. అనంతరం క్షేత్ర పీఠాధిపతి కృష్ణానందపురి స్వామిజీ ఆశీర్వచనం తీసుకున్నారు. చారిత్రాత్మక గుర్తింపు పొందిన పెనుగొండ క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మహోత్సవాల్లో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును ఘనంగా సత్కరించారు. వాసవీ మాత బంగారు కిరీటం తయారీకి సహకరించిన దాతలను ట్రస్ట్ అధ్యక్షుడు పీఎస్ గోవిందరాజులు సత్కరించారు. అనంతరం ప్రజ్ఞానంద సరస్వతీ (బాల స్వామిజీ) ప్రవచనాలు అలరించాయి. పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

వైభవంగా వెండి రథోత్సవం

పంచమ ప్రతిష్ఠాపన మహోత్సవాల ముగింపు సందర్భంగా వాసవీ మాతను వెండి రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, అమ్మవారి రూపాలతో కళాకారుల నృత్యాలు అలరించాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కేఆర్ కృష్ణ, కార్యదర్శి ఎస్.సతీష్, కోశాధికారి ఎస్ఎన్ శ్రీనివాసరావు, లోకల్ యాక్షన్ కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేశ్వరరావు, రథోత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి లక్ష్మీనారాయణ (రాము), నూలి తాతాజీ, కోట్ల రాజా, చిన్నం రామిరెడ్డి, పలివెల శ్రీను పాల్గొన్నారు.

పశ్చిమ కలెక్టర్‌గా సుమిత్ కుమార్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుమిత్ కుమార్ గాంధీ

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాల విభజన అనంతరం భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లాను ఏర్పాటు చేయడంతో జిల్లాకు మొట్టమొదటి కలెక్టర్‌గా పి.ప్రశాంతి పనిచేయగా, రెండో కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ విధులు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, స్థానిక నాయకులు కొత్త కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షలు మంగళవారం ముగిశాయి. నాలుగు కేంద్రాల్లో జనరల్, ఐదు కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 387 మందికి గాను 385 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు.

జిల్లాలో 411 మందికి కళ్యాణమస్తు లబ్ధి



కళ్యాణమస్తు చెక్కును అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద అక్టోబర్, డిసెంబర్ – 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 411 మంది లబ్ధిదారులకు రూ.2.84 కోట్ల లబ్ధి చేకూరిందని శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమంలో స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ వంకా మాట్లాడుతూ పేదలు అప్పులపాలు కాకుండా, పిల్లల చదువును ప్రోత్సహించేలా ఈ కార్యక్రమం కళ్యాణమస్తు, షాదీతోఫా కింద లబ్ధిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్సీ చేతులు మీదుగా నమూనా చెక్కును అందజేశారు.

వరుడైన నారసింహుడు

సుందరగిరిపై ప్రారంభమైన కల్యాణోత్సవాలు



స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన స్వయంభూః శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి కల్యాణోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుడిని చేశారు. స్మార్త ఆగమయుక్తంగా పాంచాహ్నిక దీక్షతో వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ కనకవల్లీ, లక్ష్మి అమ్మవార్లు పెండ్లి కుమార్తెలుగా అలంకరించి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ పండితులు నారసింహుడిని పెండ్లి కుమారునిగాను, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను చేశారు. ఆలయ ఏఈవో ఆర్.లక్ష్మణస్వామి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం సూపరింటెండెంట్ మద్దాల శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు: బుధవారం ఉదయం 7 గంటల నుంచి నిత్య హోమాలు, మూలమంత్ర హవనములు, బలిహరణ, వేద పారాయణ, ఔపోసన, మండప పూజలు, సాయంత్రం 6 గంటల నుంచి మూలమంత్ర హవనములు, బలిహరణలు, హారతి, మంత్రపుష్పములు, రాత్రి 7 గంటల నుంచి భక్తి రంజని కార్యక్రమాలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా

చింతపర్రులో అగ్ని ప్రమాదం



పాలకొల్లు మండలం చింతపర్రులో దగ్ధమైన పశువుల పాక, మృతి చెందిన గేదె

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రులో మంగళవారం తెల్లవారుజామున బోనగిరి ఏడుకొండలు, బోనగిరి వెంకటేష్‌కి చెందిన పశువుల పాకలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో పాడి గేదె మృతి చెందింది. రెండు పాడి పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. వాటి పరిస్థితి విషమంగా మారందని పశువైద్యాధికారి డా. వరప్రసాద్ చెప్పారు. అలాగే మరో రెండు గేదెలకు, ఒక ఆవుదూడకు కూడా గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ఆస్థి నష్టం సుమారు రూ.3ల క్షలు ఉంటుందని అగ్నిమాపక అధికారి వైపీ జానకిరామ్ తెలిపారు.

పాఠశాలలో పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగు



లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ముగ్గు, బ్లీచింగ్ చల్లిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

పాలకొల్లు అర్బన్: పాఠశాల ఆవరణలోకి మురుగు నీరు శీర్షికతో మంగళవారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెం ప్రాథమిక పాఠశాలలో చేరిన మురుగునీటిని బయటకు తోడారు. డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. దీంతో పాఠశాల ఆవరణలోకి చేరిన మురుగు నీరు సమస్య తీరిందని, పంచాయతీ కార్యదర్శి డి శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో ముగ్గు, బ్లీచింగ్ చల్లించి పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగు పరచామన్నారు. గ్రామంలోని ప్రధాన డ్రెయిన్‌ను ఆక్రమించుకున్న గృహ యజమానులకు నోటీసులు అందిస్తామని, అలాగే ఎవరి ఇళ్లలో మురుగు నీరు డ్రెయిన్‌లోకి రాకుండా ఇంకుడుగుంటలు తవ్వుకునే విధంగా గృహ యజమానులకు అవగాహన కల్పిస్తామన్నారు.

ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్నకు 'కాపు' కాస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాపు ప్రజా ప్రతినిధులు, నాయకులు

ఆకివీడు: మాట తప్పని, మడం తిప్పని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గత 58 నెలలగా కాపులకు అండగా, ఆర్థికంగా నిలబడ్డారని పలువురు కాపు నేతలు పేర్కొన్నారు. స్థానిక రూరల్ బ్యాంక్ ఆవరణలో మంగళవారం కాపు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహిచారు. మండల వైఎస్సార్‌సీపీ కమిటీ అధ్యక్షుడు అన్యెం కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి హయాం నుంచి కాపులు వైఎస్సార్ కుటుంబానికి అండగానే ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాపుల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచేందుకు కాపు నేస్తాన్ని అమలుజేశారని చెప్పారు. 45 ఏళ్లు నిండిన కాపు మహిళకు గత నాలుగేళ్లుగా రూ. 15 వేలు చొప్పున వారి ఖాతాల్లో సొమ్మును జమ చేశారన్నారు. డ్వాక్రా రుణ మాఫీ, సున్నా వడ్డీ వంటి వాటితో పాటు పలు పథకాలు కాపు పేదల ఆర్థిక స్థితి గతుల్ని మార్చివేశాయన్నారు. మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా కాపు సామాజిక వర్గానికి పార్టీలో సముచిత స్థానం కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ, ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తి వంచన లేకుండా కాపులు కృషి చేస్తారని గంగాధరరావు చెప్పారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో కాపులకు ఎన్నో కష్టాలున్నాయని చెప్పారు. కాపులపై ఎన్నో కేసులు పెట్టారని, ఇబ్బందుల పాలు చేసి, నిలువెల్లాముంచేశారని ఆరోపించారు. కాపులకు వెన్నుపోటు పడిసిన పార్టీ ఏదైనా ఉందంటే అది టీడీపీనేనన్నారు. నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ నగర పంచాయతీ ఎన్నికల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పలు చోట్ల కాపు సామాజిక వర్గానికి వైఎస్సార్‌సీపీ టిక్కెట్లు ఇవ్వడం, వారు విజయం సాధించారన్నారు. సమావేశంలో కౌన్సిలర్ నిమ్మల నాగు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు కేశిరెడ్డి దిలీప్, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిక్కాల రామాంజనేయులు(చిన్నా) తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారాల్లో బయో సెక్యూరిటీ విధానం



సమావేశంలో మాట్లాడుతున్న పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ

తణుకు అర్బన్: జిల్లాలో ఉన్న అన్ని కోళ్ల ఫారాల్లో అత్యున్నత స్థాయిలో శానిటేషన్‌తో పాటు బయో సెక్యూరిటీ విధానాన్ని రైతాంగం పూర్తిస్థాయిలో అమలు పరుస్తున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ చెప్పారు. తణుకు నెక్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ ఆనవాళ్లు ఎక్కడా లేవని ప్రజలెవ్వరూ కూడా ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బర్డ్ ఫ్లూ అంశం బయటకు వచ్చిన రోజు నుంచి జిల్లాలోని అన్ని కోళ్ల ఫారాల్లోనూ పశువర్థక శాఖ వైద్యులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడా కూడా కోళ్లలో ఒక్క అసాధారణ మరణం నమోదు కాలేదని తెలిపారు. బర్డ్ ఫ్లూ అనే అంశం బయటకు రాగానే ర్యాపిడ్ యాక్షన్ బృందాలు ఏర్పాటు చేసి కోళ్ల దానాలకు సంబంధించి ఇమ్యూనిటీ పెంచే విటమిన్ సీ, సెలీనియం లాంటి మందులు వాడే విధంగా ఇప్పటికే రైతాంగానికి సూచనలు చేశామని, చికెన్, కోడిగుడ్డుపై ఎటువంటి అపోహలు అవసరంలేదని అత్యధిక ప్రోటీన్స్ ఉండే వీటిని వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం డివిజన్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌కే సుధాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహారావు మాట్లాడుతూ చికెన్, కోడిగుడ్డును మన వంట గదిలో పూర్తిస్థాయిలో అత్యధికస్థాయిలో ఉడికించి తినే అలవాటు ఉన్న నేపథ్యంలో చికెన్ తినడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ కె. శంకర్ భవన్ నారాయణ, జిల్లా నెక్ చైర్మన్ గుబిలి గంగాధరరావు, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కోమటిపల్లి వెంకట సుబ్బారావు, కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పౌల్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నడిపల్లి తాతరాజు తదితరులు పాల్గొన్నారు.

● వైఎస్సార్‌సీపీలో చేరిక



తాడి సూర్య కళావతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి ఇతర పార్టీల నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. దివంగత టీడీపీ నాయకుడు తాడి వెంకటేశ్వరరావు భార్య తాడి సూర్య కళావతి గుడాల గోపి సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆమెకు వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని గోపి కోరారు.

శ్రీవారి క్షేత్రానికి 10 వేల మంది భక్తుల పాదయాత్ర



దొరసానిపాడులో పాదయాత్ర భక్తులకు అల్పాహారాన్ని అందిస్తున్న దాతలు

ద్వారకాతిరుమల: జంగారెడ్డిగూడెం నుంచి సుమారు 10 వేల మంది భక్తులు శ్రీవారి క్షేత్రానికి మంగళవారం పాదయాత్రగా విచ్చేశారు. ప్రతి ఏటా మాఘశుద్ధ ఏకాదశి నాడు వారంతా ఇలా కాలినడకన క్షేత్రానికి వస్తున్నారు. అందులో భాగంగా జంగారెడ్డిగూడెం లోని పాతబస్టాండు వద్ద ఉన్న సాయిబాబా ఆలయం నుంచి తెల్లవారుజామున తమ యాత్ర ప్రారంభమైందని హిందూధర్మ ప్రచార సమితి సభ్యులు తెలిపారు. మార్గ మధ్యలో పలువురు దాతలు వీరికి అల్పాహారాన్ని అందజేశారు. పెద్ద ఎత్తున మహిళలు, యువత ఇందులో పాల్గొన్నారు. వీరంతా వెంకటాపురం మీదుగా ద్వారకాతిరుమల కొండపైన క్షేత్రపాలకుని ఆలయానికి ఉదయం 10 గంటల సమయంలో చేరుకుని శివదేవుడిని దర్శించారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. హిందూధర్మాన్ని పరిరక్షించే క్రమంలో తామంతా ప్రతి ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన ద్వారకాతిరుమల క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్నట్లు హిందూధర్మ ప్రచార సమితి సభ్యులు తెలిపారు. 2002 లో 18 మందితో ప్రారంభమైన ఈ పాదయాత్ర ప్రస్తుతం వేలాది మందితో సాగుతోందన్నారు.

తాడిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

పెదవేగి: తాడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ పైనుంచి కింద పడి గీతకార్మికుడు మృతి చెందాడు. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని న్యాయంపల్లి గ్రామానికి చెందిన బెజవాడ రాంబాబు కల్లుగీత కార్మికుడు సోమవారం సాయంత్రం తాడిచెట్టు ఎక్కిన అతను ప్రమాదవశాత్తూ తాడిచెట్టుపైనుంచి పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే గీత కార్మికుడు బెజవాడ రాంబాబు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా విద్యుత్‌కు సబ్సిడీపై హర్షం



గాదిరాజు వెంకటసుబ్బరాజు

భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా తాజాగా నాలుగువేల మంది ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ లభించనుందని ఆక్వా రైతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిరాజు వెంకటసుబ్బరాజు చెప్పారు. ఆక్వా రైతుల సమస్యలపై అప్సాడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ దృష్టికి తీసుకువెళ్లగా విద్యుత్ సబ్సిడీ విషయం తెలిపారన్నారు. మంగళవారం సుబ్బరాజు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 63 వేల ఆక్వా విద్యుత్ కనెక్షన్స్ ఉండగా వాటిలో ఇప్పటి వరకు 51 వేల విద్యుత్ కనెక్షన్స్‌కు ప్రభుత్వం యూనిట్‌కు కేవలం రూ. 1.50 పైసలకే సబ్సిడీపై విద్యుత్ అందిస్తుందన్నారు. ఈనెలాఖరు నాటికి మరొక 4 వేల విద్యుత్ కనెక్షన్స్‌కు సబ్సిడీ అందనుందని సుబ్బరాజు వివరించారు. ఈ నెల 12న రొయ్యల ఎగుమతిదారులు రొయ్యల ధరలను కిలోకు సుమారు రూ. 40 వరకు ఒక్కసారిగా తగ్గించిన విషయాన్ని అప్సాడా వైస్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా ప్రాసెసింగ్‌ప్లాంట్స్ యజమానులతో మాట్లాడి తగ్గిన ధరలు కొంత పెంచేందుకు కృషి చేశారని వివరించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సహకారానికి సుబ్బరాజు కృతజ్ఞతలు తెలిపారు.

పెంటపాడు పీహెచ్‌సీలో చోరీకి యత్నం



ఆసుపత్రి ఇంజక్షన్‌రూంలో మందులు తగులబెట్టిన దృశ్యం

పెంటపాడు: పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం జరిగింది. ఈ సంఘటనలో దుండగులు ప్రధాన ద్వారానికి తాళం వేసి ఉన్న గొళ్లెం పెకలించి లోపలికి ప్రవేశించి ఇంజక్షన్ రూం, ఆపరేషన్ థియేటర్ రూమ్‌లోని సామగ్రిని ధ్వంసం చేశారు. అక్కడ ఉన్న ఇంజక్షన్‌ల పెట్టెలు, మందులు కాల్చివేశారు. పెంటపాడు మూడు రోడ్ల కూడలిలో ఉండే ఆసుపత్రిలో ఈ సంఘటన జరగడంతో ఉదయం ఆసుపత్రి తలుపులు తెలిచిన సిబ్బంది, వచ్చిన పేషెంట్‌లు భయభ్రాంతులకుగురయ్యారు. ఆసుపత్రి డాక్టర్ తోట రాజేష్ ఘటనపై పెంటపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మోహన్ రావు ఆధ్వర్యంలో ఏఎస్ఐ ఉమామహేశ్వరి సిబ్బందితో ఆసుపత్రిని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ఆసుపత్రి రికార్డులు భద్రంగా ఉన్నాయని పీహెచ్‌సీ డాక్టర్ తోట రాజేష్ తెలిపారు. మంగళవారం ఓపీకి కొంతమేర ఆలస్యం జరిగినా పేషెంట్లకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందించినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ గురించి పునరాలోచించాలి



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం ఇస్తున్న పుష్పరాజ్

నరసాపురం: ఎస్సీ వర్గీకరణపై వేసిన కమిటీని రద్దు చేయాలని, వర్గీకరణపై పునరాలోచన చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. మంగళవారం నరసాపురం వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌ను స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందించారు. దళితులు అంతా కలిసి ఉండాలని, దళితుల ఆర్థిక పురోగతిపై వర్గీకరణ కాకుండా మరో ఆలోచన చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కేంద్రం ఎస్సీ వర్గీకరణ కోసం తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

29 వరకూ లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణకు గడువు

ఏలూరు(మెట్రో): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు (పెన్షనర్స్ వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్లు) సమర్పించడానికి ఈ నెల 29 వరకూ గడువు ఉందని పశ్చిమ గోదావరి జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి అడారి గణేష్ తెలిపారు. పింఛనర్లు స్థానిక ట్రెజరీ కార్యాలయాల్లో గానీ, ఆన్‌లైన్‌లోగానీ, స్థానిక పోస్ట్ ఆఫీసులల్లో లైఫ్ సర్టిఫికెట్ కోసం వేలిముద్ర వేయవచ్చాన్నారు. లైఫ్ సర్టిఫికెటు సబ్మిట్ చేయని పింఛనర్లకు సంబంధించి మార్చి 2024 పింఛన్ ఆపేస్తారని పేర్కొన్నారు. ఫ్యామిలి పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లతోపాటుగా నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆయన కోరారు.

గోదావరి కాలువలో పడి వ్యక్తి మృతి

భీమడోలు: మండలంలోని పూళ్ల గ్రామానికి చెందిన సనపల నరసింహులు(50) మృతదేహాన్ని సోమవారం రాత్రి భీమడోలులోని కాలువలో పోలీసులు గుర్తించారు. పూళ్లకు చెందిన సనపల నరసింహులు ఈ నెల 16న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా నరసింహులు వెళ్లిపోగా అతని ఆచూకీ కోసం కుమారుడు సనపల రంగారావు గాలిస్తున్నాడు. ఈ క్రమంలో నరసింహులు మృతదేహం భీమడోలు రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కాలువలో తేలుతున్నట్లు గుర్తించారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి రామిశెట్టి కిరణ్‌కుమార్ (30) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15న ఇంటి వద్ద మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగాడు. అనంతరం తనకు తానుగా వైద్యం నిమిత్తం ఉండి పీహెచ్‌సీకి వెళ్లడంతో వారు అక్కడి నుంచి అతనిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు.

క్లుప్తంగా

4 నుంచి జట్లపాలెంలో సువార్త స్వస్తత సభలు



క్రీస్తు సువార్త సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ

పెంటపాడు: మండలంలో మార్చి నెల 4 నుంచి మూడు రోజులపాటు జట్లపాలెం గ్రామంలో 22వ వార్షిక క్రీస్తు సువార్త స్వస్తత సభలు నిర్వహించనున్నట్లు పడాలకు చెందిన వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు, ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సభల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన సాయిలన్న, పాస్టర్లు ఘనరాజు, జాజిరాజులు పాల్గొంటారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు నవీన్‌కుమార్, సత్యకృప తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

తణుకు టౌన్: దేశంలోని పౌరులందరికీ చట్టాలు అన్నీ సమానమేనని తణుకు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏవీ నాగరాజు చెప్పారు. మంగళవారం అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా తణుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ 4వ అదనపు జిల్లా జడ్జి డీ సత్యవతి ఆదేశాల మేరకు తణుకులోని సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకాం ప్రజలకు ఎలాంటి భేదం లేదన్నారు. విద్యార్థినులకు చట్టంలోని ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కే వెంకటేశ్వర్లు, ఎంఎల్‌ఎస్సీ సభ్యుడు ముప్పిడి సుబ్బయ్య, కే మునిస్వామి, ఏ అజయ్‌కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ మేరీ, పట్టణ ఎస్‌ఐ పీ అప్పారావు, ఏఎస్‌ఐ కృష్ణమూర్తి, హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహ స్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో శ్రీవరాహలక్ష్మీ నరసింహ స్వామి

అత్తిలి: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా అత్తిలి గ్రామంలో బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేక పూజలు జరిపి, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

శానిటరీ వర్కర్స్‌కు న్యాయ విజ్ఞాన సదస్సు

భీమవరం: ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమవరం పట్టణంలోని బుధవారం మార్కెట్ వార్డు సచివాలయం వద్ద శానిటరీ వర్కర్స్‌కు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాది సుబ్బారావు మాట్లాడుతూ పేదరికం నిరుద్యోగం వంటి సమస్యలను అధిగమించడానికి ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతి, భద్రత, శ్రేయస్సు కోసం సామాజిక న్యాయం అవసరమని గుర్తించి, పేదరికం, అసమానత, సాంఘిక బహిష్కరణ మూలకారణాలను పరిష్కరించడానికి ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌వి రంగారావు, చెల్లబోయిన రంగారావు, పీఎల్‌వీఎం కమల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కలిగొట్ల ఘటనపై కేసు నమోదు

ఉండి: సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మండలంలోని కలిగొట్ల గ్రామంలో కిరాణాషాపు యజమాని అయిన యశోధ కృష్ణయ్య అనే వ్యక్తి ఇంట్లో చొరబడిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వ్యాపారం ముగించుకుని ఇంట్లోకి వెళ్లిన కృష్ణయ్యపై అప్పటికే ఇంట్లో ముసుగు వేసుకుని దాగి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి వెనుకవైపుగా వచ్చి ముసుగు వేయడంతో కంగారు పడిన కృష్ణయ్య కేకలు వేశాడు. దీంతో చుట్టుప్రక్కల వారు అక్కడికి రావడాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తణుకులో అభివృద్ధి పరుగులు

- రూ. 302 కోట్లతో తణుకులో నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం
- ప్రజా సమస్యల వేదికగా గడప గడపకు మన ప్రభుత్వం



తణుకులో హెడ్ పోస్టాఫీసు ప్రాంతంలో వేసిన సీసీ రోడ్డు



పైడిపర్రులో సొసైటీ వీధిని అభివృద్ధి చేసిన సీసీ రోడ్డు

తణుకు అర్బన్: అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడం, జేబులు నింపుకోవడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య.వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుకు భిన్నంగా సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేశారు. సుమారు రూ.302 కోట్లు వెచ్చించి, చక్కనైన రహదారులను నిర్మించారు. ఎటువంటి అవినీతికి అస్కారం లేకుండా పారదర్శకంగా రోడ్లను నిర్మించారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణాలు చేపట్టిన ఘనత రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దక్కింది. తణుకు మున్సిపాల్టీ పరిధిలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పట్ల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా ప్రాంతంలో ఈ సమస్య ఉందని ప్రజలు తెలపడమే తరువాయి సమస్య తీర్చేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తున్నారు.

34 వార్డుల్లోను...

తణుకు మున్సిపాల్టీ పరిధిలోని 34 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, సచివాలయ భవనాలు, ఆర్‌బీకే సెంటర్‌లు, పైపులైన్లు, తాగునీరు, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లు, కమ్యూనిటీ హాల్స్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, జగనన్న హౌసింగ్ కాలనీ, విద్యుత్ శాఖ, సబ్ స్టేషన్స్ వంటి అభివృద్ధి పనులు రూ. 302 కోట్ల నిధులతో నిర్వహించిన పనులు పరుగులుపెట్టాయి.

మంత్రి కారుమూరి చొరవతో...

ముఖ్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిత్యం ప్రజల్లో ఉన్న రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రజలు తెలిపిన సమస్యకు వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి పనులు చేయించారు. ప్రజలు ఎక్కువ శాతం సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు అడగడంతో వాటిని ఒక ప్రణాళిక ప్రకారం టెండరు పిలిపించి పనులు పూర్తి చేయించారు.

అభివృద్ధిలో తణుకు బెస్ట్



తణుకు మున్సిపాల్టీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు శరవేగంగా జరిగాయి. మాకిది కావాలని అడిగిన వెంటనే సదరు పనిని ఎస్టిమేట్ చేయించి వెంటనే అభివృద్ధి చేశారు. దీంతో అభివృద్ధి విషయంలో తణుకు ప్రాంతం బెస్ట్‌గా నిలుస్తుంది. – పొట్ల సురేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు

ప్రజలు అడగడమే ఆలస్యం వెంటనే పరిష్కారం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమస్యల పరిష్కారానికి వేదికగా మారింది. వార్డుల్లో ప్రజలు అడగడం ఆలస్యం అనే విధంగా మంత్రి కారుమూరి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పనులు చేసే వరకు నిద్రపోలేదు. దీంతో తణుకులో అధికభాగం సిమెంట్ రోడ్లతో కళకళలాడుతోంది. – కుడుపూడి చంద్రరావు, తణుకు

మత్స్యకారులు పీఎంఎంఎస్‌వైని వినియోగించుకోవాలి



వెంకట్రామన్నగూడెం చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మత్స్యకారులు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలోని చెరువులో సబ్సిడీపై చేప పిల్లల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపర్చడానికి 40 శాతం సబ్సిడీతో నాలుగు లక్షల చేప పిల్లలను పెంటపాడు, బొమ్మిడి మత్స్యకార సొసైటీల పరిధిలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ పోలిమోను నాగఅంజూష మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చింతా వెంకట్రావు, పరిమి తులసీదాస్, పసుమర్తి పెద్దబ్బులు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి శివరామకృష్ణ, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పోలిమోను శ్రీనివాస్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాలమ్మ ఆలయం వద్ద కుంకుమ పూజలు



కుంచనపల్లి గ్రామంలో దేశాలమ్మ ఆలయం వద్ద కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో పునఃనిర్మించిన దేశాలమ్మ ఆలయం వద్ద మంగళవారం మంగళవారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు విరివిగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు కృష్ణమోహన్‌శర్మ బ్రహ్మత్వంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం పూజా కార్యక్రమాలు జరిగాయి. స్థానికులతో పాటు పరిసర ప్రాంత భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్ సోమా మురళీకృష్ణ మాట్లాడుతూ సీజీఎఫ్ కమిటి నిధులు రూ.33లక్షలు, ప్రజావిరాళం మరో రూ.17లక్షలు వెరసి రూ.50లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 10.31 గంటలకు ఆలయంలో దేశాలమ్మ వారి విగ్రహప్రతిష్ఠ జరుగుతుందన్నారు. దీంతో ప్రతిష్ఠ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. అనంతరం ఆలయ శిఖరంపై బూరెలు పోసే కార్యక్రమం జరుగుతుందని, స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనుపూరి ఉదయ్‌భాస్కర్, గుమ్మళ్ల తాతారావు, మేకా శ్రీను, మునీశ్వరరావు, శ్రీనివాస్ ప్రభృతులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

పెంటపాడు: మండలంలోని మీనవల్లూరు గ్రామ పంచాయతీలో జలజీవన్ మిషన్ పనులు, స్వచ్ఛభారత్ కార్యక్రమాల అమలును కేంద్ర బృందం మంగళవారం పరిశీలించింది. గ్రామంలో పర్యటించి గ్రామ కమిటీతో పలు అంశాలపై సమీక్షించారు. మంచినీటి నాణ్యత, పరీక్ష విధానాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతపల్లి లక్ష్మి తదితరులు తమకు తాగునీరు సమీప గ్రామం నుంచి పైపులైన్లు ద్వారా తెచ్చు కొంటున్నామని, గ్రామంలో బీసీ కాలనీలో జనాభా పెరిగిన దృష్ట్యా మరో 60 వేల లీటర్ల ట్యాంక్ అవసరమని చెప్పారు. ఈ విషయంపై సభ్యుల బృందం అంగీకరించి సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులతో పాటు, గ్రామ కార్యదర్శి దుర్గ, పార్టీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోటేరులో కేంద్ర బృందం పర్యటన

ఇరగవరం: మండలంలోని గోటేరు, అయినపర్రు గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలోని జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జుత్తిగ గాయిత్రి కిశోర్, ఎంపీటీసీ జుత్తిగ రాజేశ్వరి, ఇంచార్జీ ఈవోపిర్డీ వై ముని రాజు, పంచాయతీ కార్యదర్శి వి గణేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజాసేవకే అంకితం



పెంటపాడు -3 వలంటీర్ స్పందనను అభినందిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక వలంటీర్లు సేవే లక్ష్యంగా పని చేస్తే ప్రజల గుండెల్లో నిలిచిపోయారని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ అన్నారు. మండలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సేవావజ్ర పతకం సాధించిన ఉండ్రాజవరపు స్పందనను మంగళవారం పలువురు అభినందించారు. ఆమెతో పాటు, మండలంలో సేవా రత్న పతకాలు పొందిన పిల్లి పద్మ (కొండేపాడు), చల్లా జ్యోతి (రామచంద్రపురం), తూము సాయి (రావిపాడు), మీసాల శ్రీను (వల్లూరుపల్లి), సత్తి వెంకటలక్ష్మి (పెంటపాడు-3) లకు సేవారత్న అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిన నాటి నుండి నేటివరకు ఒకే తీరుగా ప్రజలకు సేవలందిస్తున్న పలువురి సేవలు అమోఘమని ఈ సందర్భంగా సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డులు పొందిన వాలంటీర్లను ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమాల్లో పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, రావిపాడు సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, కొండేపాడు గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి, రామచంద్రపురం చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు చల్లా లింగమూర్తి, మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి, పెంటపాడు ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి బాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, ఉండ్రాజవరపు గోపి పాల్గొన్నారు.

చంద్రబాబు బతికినంత కాలం ఎక్స్ సీఎంగానే ఉంటారు



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీలో చంద్రబాబు బతికినంత కాలం ఎక్స్ సీఎంగానే ఉంటారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో జరిగిన సమావేశంలో మంగళవారం మంగరాజు మాట్లాడుతూ ఏపీలో సంక్షేమాలు అమలు, పేద ప్రజలకు సేవలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా తప్పక ఉంటారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రజానీకానికి నిర్విరామంగా అందించిన జగన్‌పై సవాలు చేసే హక్కు బాబుకు లేదన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న వ్యక్తులకు కూడా జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న ప్రజాధరణకు సిద్ధం సభలు అద్దం పడుతున్నాయని తెలిపారు. అంబేడ్కర్ స్ఫూర్తితో వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా, అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నిడిపిస్తూ సీఎం జగన్ పాలన అందిస్తున్నారని, సభలకు అందుకే భారీగా జనం తరలివస్తున్నారని తెలిపారు. సీఎం జగన్‌పై ప్రజల విశ్వాసంతో ఉన్నారని, ఈ సభలు ద్వారా అందరికి అర్థమైందన్నారు. సిద్ధం సభలకు జనం రావడంతో సహించలేని చంద్రబాబు ఎల్లో మీడియాతో దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మరొకసారి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న అక్క, చెల్లమ్మలను చంద్రబాబు నిలువునా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వి.సునీల్ బాబు, సందీప్, అనిల్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



నూతన కార్యాలయంలో పాల్గొన్న యువనేత కొట్టు విశాల్, రొక్కాల నాగబుజ్జి తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ అన్నారు. పట్టణంలో మంగళవారం ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సేవా సంస్థ నూతన కార్యాలయాన్ని కొట్టు విశాల్ ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, ఎంపీటీసీ పొట్ల ఏడుకొండలు, సేవా సంస్థ సభ్యులు రొక్కాల ఆశీర్వాదం, మరియమ్మ, వెంకటేష్, రోజా, రాజు, రాజ్‌కుమార్, పద్మ, ప్రియ రమేష్ తదితరులు హాజరైయారు.

నేటి నుంచి తేతలిలో గోగులమ్మ జాతర మహోత్సవం




తేతలిలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వెలుగులు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో శ్రీ గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు తెలిపారు. గురువారం రాత్రి గ్రామంలో గోగులమ్మ వారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని అమ్మవారి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకూ భారీ విద్యుత్ దీపాల అలంకరణ ఏర్పాటు చేశారు. ఏటా జరిగే ఈజాతర మహోత్సవానికి పరిసర గ్రామాల భక్తులతో పాటు ఇతర ప్రాంతాల్లో భక్తులు ఈ జాతరలో పాల్గొంటారని తెలిపారు.

అంతర్వేది యాత్రికులకు అన్నప్రసాద వితరణ

యలమంచిలి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణం తిలకించడానికి వెళ్తున్న యాత్రికులకు చించినాడ బైపాస్ రోడ్డులో కాయకూరల వర్తకులు మంగళవారం భోజనాలు ఏర్పాటు చేశారు. సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఏడువేల మందికి అన్నసమారాధన చేశారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమాలను వర్తకులు సుంకర నరసింహమూర్తి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శోభాయమానంగా కేశవస్వామి కల్యాణం





తణుకులో భీష్మ ఏకాదశి సందర్భంగా పూజలందుకున్న శ్రీకేశవస్వామి, తణుకులో శ్రీకేశవస్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ సుబ్బారావు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- 10వేల మందికి అన్నసమారాధన

తణుకు అర్బన్: భీష్మ ఏకాదశి సందర్భంగా తణుకులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకేశవస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ పెద్దల సహకారంతో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో భాగంగా ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. 19వ తేదీ రాత్రి 2.30 గంటల ముహూర్తానికి మేళతాళాలు, వేదపండితుల వేద మంత్రోచ్ఛరణముల మధ్య కల్యాణ ఘట్టాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా భారీ బాణాసంచా కాల్పుల మధ్య స్వామివారి గ్రామోత్సవం జరిపారు. మంగళవారం తెల్లవారు జాము నుంచి స్వామివారి దివ్యదర్శన భాగ్యాన్ని కల్పించడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

10వేల మందికి అన్నసమారాధన. .

తణుకు శ్రీకేశవస్వామి ఆలయ ప్రాంతంలోని కొండాలమ్మ పుంత రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ పందిర్లలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సుమారుగా 10వేలకు పైగా భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సప్పా బలరామకృష్ణ, కుడుపూడి చంద్రరావు, తాటిపర్తి వాసు, రేలంగి రాంబాబు, షేక్ జిలాని, గుబ్బల సూర్యచంద్రరావు, పెదపాటి సుబ్రహ్మణ్యం, హనుమంతు నారాయణ, చీర్ల బ్రహ్మాజీ, రంభ నాగేశ్వరరావు, కంతేటి సత్యనారాయణ, తానేటి ప్రసాద్, దేవరకొండ అభిషేక్, శీలం త్రిమూర్తులు, అనపర్తి జయరాజు, ఆలయ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



కేశవస్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు.



అన్నసమారాధనలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు